# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 141 ప్రకాశం, శుక్రవారం 20- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349


## గ్రూపు సభ్యుల జీవనోపాదుల సర్వే సమర్ధవంతంగా చేయండి !

డిఆర్డిఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. నారాయణరావు



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** మండలంలో మొత్తం 971 గ్రూపులో 9710 సభ్యులు ఉన్నారనీ పిడి టి. నారాయణ రావు అన్నారు. మండలంలో మొత్తం 99 మంది ఈనారీలు తో పాటు ఒక్కొక్క ఈనారికి 10 గ్రూపులు 100 మంది సభ్యులు వీరు గ్రూపు ద్వారా తీసుకున్న వివిధ రకాలైన రుణాలు బ్యాంకులింకేజీ, శ్రీనిధి, ఉన్నతి, సిఐఎఫ్ ద్వారా తీసుకున్న రుణాలు వారు ఏ ఏ రకమైనటువంటి జీవనోపాదులు పెట్టుకొని వాటి ద్వారా నెలకు ఎంత ఆదాయం వస్తుంది ఎంత ఖర్చవుతుంది అనేటువంటి ఎస్ జి హెచ్ ఆదాయ సర్వే యాప్ ను కందుకూరు మండలం కొండముడుపాలెం గ్రామంలో పాల్గొని ఈనారీలు చేసే సర్వేను పరిశీలించి తగు సలహాలు, సూచనలను గురువారం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం టి. సురేష్ ,వివో ఏలు, ఈనారిలు, గ్రూపుసభ్యులు పాల్గొన్నారు.


## జిఎఫ్ఎల్ఎన్ అభ్యసన సామర్ధ్యాల పరిశీలన







**క్రైమ్ కౌంటర్ న్యూస్ ....మార్కాపురం జిల్లా...** కంభం: స్థానిక ఎంఎస్ఎన్ కందులాపురం ప్రాధమిక పాఠశాలను గురువారం ఎంఈఓలు అబ్దుల్ సత్తార్ , టి.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా విభాగాల వారీ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి,నిర్దేశిత సమయంలో విద్యార్థులందరినీ స్కై లెవెల్లో ఉండేలా చూడాలనీ, భాషా నైపుణ్యాలు,గణిత సామర్థ్యాలలో ఖచ్చితమైన ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. 75 రోజుల కార్యాచరణ ప్రణాళికలో గడచిన 48 రోజుల ప్రగతిని సమీక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ ఖాదర్ , గౌస్ ఖాన్ ,నాగరాజు , డి.నవీన పాల్గొన్నారు.




**ఒంగోలు క్రైశీ కౌంటర్ ప్రతినిధి,** విజయవాడ లోని డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా ను వారి కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం లోని విజయవాడ డివిజన్ పరిధి లోని పలు స్టేషన్ ల అభివృద్ధి, అండర్ పాస్లు, ఆర్ యు బి, ఆర్ఓబిల గురించి, పలు సమస్యలు అంశాలపై వారితో చర్చించారు. ఒంగోలు లోని రైల్వే స్టేషన్ లో ప్లాట్ ఫామ్ నెం. 4-5 ఇంకా పూర్తి కానందున, కోచ్ డిస్ప్లే బోర్డు లు లేనందువలన ప్రజలు, ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారని, అవి పూర్తి అయ్యి అందుబాటులోకి వచ్చే వరకు ట్రైన్లను 3 వ ప్లాట్ ఫారం మీదనే నడపాలని కోరా రు.

## దోర్నాల వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా



**క్రైమ్ కౌంటర్ న్యూస్.... మార్కాపురం జిల్లా....** పొదిలి పట్టణంలోని విశ్వనాథపురం నందు దోర్నాల కొండారెడ్డి,హైమావతి గార్ల కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరుఅయి నూతన వధువు అయిన రేవతి ,ని ఆశీర్వదించిన గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు , మరియు తదితరులు పాల్గొన్నారు..







**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా...**మరి స్క్రోలింగ్ తేదీ 19.2.26 దోర్నాల, 1.ఈనెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దోర్నాల మండలం గంటవాని పల్లి గ్రామంలో వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను శంకుస్థాపన చేస్తారు, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు. 2. దోర్నాల మండలం గంటవానిపల్లి గ్రామం లో ముఖ్య మంత్రి పర్యటన సంద ర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన --- జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు,జిల్లా ఎస్.పి వి.హర్షవర్ధన్ రాజు, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్ ఛార్జి గూడూరు ఎరిక్షన్ బాబు , జిల్లా పౌర సంబంధాల అధికారి మార్కాపురం వారిచే జారీ చేయ డమైనది .

## బ్రాహ్మణ బంధువుకు సన్మానం




**ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి,** బ్రాహ్మణ బంధువు సామాజికవేత్త పండిత తొండపి మల్లి నాధుడు సమాజాభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎల్సిఈఎస్ కళానిలియం జాతీయ సెక్రెటరీ బుచ్చేశ్వర్ రావు. అన్నారు. సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఆయన్ను దంపత సమేతంగా సన్మానించారు. తన వంతు సహాయం అందజేస్తూ నిర్విరామంగా కృషి చేస్తున్న పండిత తొండపి మల్లి నాధుడు ఎందరికో ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. మంచి మనిషిని సత్కరించడం చాలా సంతోషంగా ఉందనీ వివరించారు.దంపత సమేతంగా వారిని గౌరవించుకోవడం ద్వారా వారు ఎందరికోతీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని అన్నారు బ్రాహ్మణులు అందరూ సమాజ సేవలో కృషి చేస్తున్న బ్రాహ్మణులను గుర్తించి వారిని సత్కరించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

## చత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**గుడ్లూరు క్రైం కౌంటర్ ప్రతినిధి,**హైందవ వీరుడు,మరాఠీ యోధుడు చత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని ఉమ్మడి ప్రకాశం జిల్లా గుడ్లూరు మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్లో గుడ్లురు మండల భారతీయ జనతా పార్టీ మరియు నేత్రపురి సేవక్ ఆధ్వర్యంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నేత్రపురి శ్రీరామసేవక్ సభ్యులు ఎయిర్టెల్ చిన్న మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజు హిందూ మతం,హిందూ ధర్మం ఉన్నంత కాలం గుర్తుంచుకోవాల్సిన వీరుడని తనలో అంత వీరత్వాన్ని నింపిన వ్యక్తి తన తల్లి జిజియా భాయి అని, చిన్నప్పటినుంచి చత్రపతి శివాజీ మహారాజ్ కి ఉగ్గుపాలతోటి పౌరుషాన్ని నూరిపోసిందని ఆనాడు మొగలాయిలు హిందూ స్త్రీలను చరపడుతుంటే ఆ క్షుద్ర రాజకీయానికి ఉగ్ర నేత్రుడై మతోన్మాద శక్తులను తుడిచి పారివేసిన యోధుడు. ఆనాడు హైందవ సామ్రాజ్యాన్ని మొగలాయిలు విస్తరించి, మొగల్ చక్రవర్తి ఔరంగజేబు లాంటి దుర్మార్గులు మన దేవాలయాలన్నింటిని కూల కొడుతుంటే అలాంటి దుర్మార్గులను ఎదిరించి మట్టుపెట్టిన మహావీరుడు చత్రపతి శివాజీ.. అలాంటి మహనీయుని ప్రతి హిందువు గుర్తుంచుకోవాలని,ఈనాడు హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించాలి అశీటే నేడు ప్రతి తల్లి జిజియాబాయిల తన బిడ్డలను చత్రపతి శివాజీ లాగా పెంచాలని, ప్రతి హిందువు శివాజీ లాగా పౌరుషంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేత్రపురి శ్రీరామ సేవక్ ఆర్యనిర్వాహకులు ఎయిర్టెల్ చిన్న, బిజెపి సీనియర్ నాయకుడు ఇన్నమూరి ప్రమీల సుధాకర్, మండల బిజెపి అధ్యక్షుడు జలగం వరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు మేకపోతుల నాగరాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరా మాల్యాద్రి, గుడ్లూరు మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు ఆలా శివ, అన్నంగి అంకమ్మరావు, గొల్ల స్వరూప్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం గ్రామస్తులకు పండ్లు,బిస్కెట్లు పంపిణీ చేశారు.

## వినుకొండ పరిసరాల్లో భూ ప్రకంపనలు



**క్రైం కౌంటర్ న్యూస్ :** వినుకొండటౌన్, ఫిబ్రవరి 19 పల్నాడు జిల్లా వినుకొండలో గురువారం తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించింది. దీంతో ప్రజలు భయంభ్రాంతులకు గురయ్యారు. పట్టణానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో భూమి కంపించినట్టు భూగర్భ శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. రిక్టర్ స్కేలుపై తీవ్రత 3.5గా నమోదైనట్టు అధికారులు తెలిపారు. తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో వినుకొండ పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉండటం వల్ల ప్రకంపనల తీవ్రత స్పష్టంగా తెలిసినట్టు సమాచారం. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్టు ఇప్పటివరకు నివేదికలు అందలేదు.

# మూతబడిన అంగన్వాడి కేంద్రం




**గుడ్లూరు క్రైకీ కౌంటర్ ప్రతినిధి,** కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలతో అంగన్ వాడి కేంద్రాల ద్వారా గర్భవంతులు, బాలింతలు,చిన్నారులకు పౌష్టిక ఆహారంమైన కోడిగుడ్లు, పాలు, బాలమృతం, బెల్లం, ఖర్జూరం, వేరుసెనగ చిక్కి రాగి పిండి, బియ్యము, కందిపప్పు, పామాయిల్ తదితర వాటిని అందజేస్తున్నాయి. ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని ఉలవపాడు లింగసముద్రం గుడ్లూరు మండలాలు ఉన్నాయి. కొందరు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు తెలియని పరిస్థితి నెలకొంది, సమయపాలన పాటించడం లేదని ప్రజలనుంచి సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. సిడిపిఓ, సూపర్వైజర్లు నిరంతరం అంగన్వాడి కేంద్రంలో తనిఖీ చేయాల్సిందే. తూతుమాత్రముగా కేంద్రం లను తనిఖీ చేయడం వలన పరిస్థితి ఉందని పలువురు తెలియజేశారు.

# పడకల సంఖ్యను 300కు పెంచాలి !ఎమ్మెల్యే ఇంటూరి



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,** సీఎంనారా చంద్రబాబు నాయుడు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును గురువారం సచివాలయంలో కలిశారు. కందుకూరులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల స్థాయిని పెంచేలా ఆదేశాలనుఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2003లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో 100 పడకల వైద్యశాలగా మార్చిన సంగతిని గుర్తుచేశారు. మూడు నియోజకవర్గాలకు చెందిన రోగులు ఏరియా వైద్యశాలకు వస్తున్నారని, పెరిగిన జనాభా దృష్ట్యా ఆసుపత్రి స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. పడకల సంఖ్యను 300 కు పెంచాలని కోరారు. పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న కందుకూరు ప్రాంతానికి, ప్రస్తుతం వైద్యశాలలో సదుపాయాలు సరిపోవటం లేదని, పడకలతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కు అందించారు.
ఎమ్మెల్యే విజ్ఞప్తికు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, త్వరలోనే ఆసుపత్రి స్థాయిని పెంచేలా సహకారం అందిస్తానని ఆయనకు తెలిపారు.

# డిపిఓ వెంకటేశ్వరరావు సుడిగాలి పర్యటన



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** మండలం లోని మాచవరం గ్రామం లో ఏర్పాటు చేసి ఉన్న చెత్త నుండి సంపద కేంద్రం పరిశీలించి గ్రీన్ అంబాసిడర్లకు సూచనలను చేశారు .గ్రామంలో పనికిరాని తడి చెత్త పొడి చెత్తను గృహాల నుంచి విడివిడిగా గ్రీన్ అంబాసిట్ల ద్వారా సేకరించి చెత్త నుండి సంపద కేంద్రం నకు తీసుకువచ్చి తడి చెత్తను పొడి చెత్తను విడివిడిగా చేసి తడి చెత్త ద్వారా వర్మి కంపోస్టు తయారుచేసి గ్రామంలోని రైతులకు విక్రయించి తద్వారా గ్రామపంచాయతీకి నిధులు జమ చేయాలని పంచాయతీ డెవలప్మెంట్ అధికారికు
తెలియ జేశారు .గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని సైడ్ కాలువలను శుభ్రపరిచి ప్రజలు జ్వరాలు రాకుండా బ్లీచింగ్ చెల్లించి ప్రతిరోజు నీటి సరఫరా త్రాగునీటి సరఫరా రాబోయే వేసవి కాలంలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలని అవసరమైన మేరకు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఐ వి ఆర్ ఎస్ కాల్స్ పట్ల గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని పింఛన్లు సకాలంలో లబ్ధిదారులకు అందించాలని తెలియ జేశారు.ఇంటి పన్నులు నీటి పన్నులను సకాలంలో చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రత్న కుమార్ ఉప మండల అధికారి పి ఓబులేష్ స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ మెడబలిమీ రమణయ్య ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అద్వితీయ యుద్ధ తంత్ర మేధావి!ప్రముఖ వైద్యులు డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** చత్రపతి శివాజీ మహారాజ్ ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కందుకూరు ఆర్ఎస్ఎస్ ఖండ సంఘచాలక్, హరణి ప్రజా వైద్యశాల డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు అన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా కందుకూరు బజరంగి సర్కిల్ వద్ద చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలను వేసి గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విదేశీయుల నుండి భారతీయులను కాపాడి, హిందూ సామ్రాజ్యాన్ని ఏర్పరచిన మహాదీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా వారికి నివాళులర్పించడం ఎంతో సంతోషమని అన్నారు. శివాజీ ధీరత్వాన్ని, దేశం కోసం చేసిన ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరి బిజెపి ఇన్చార్జి ఘట్టమనేని హరిబాబు, మంచిరాజు మురళీమోహన్, ఇప్పగుంట మాధవరావు, కళ్యాణ్ మిత్రబృందం, చక్కా వెంకట కేశవరావు, ఇస్కాల మధు, నారాయణం రాధాకృష్ణమాచార్యులు, గుర్రం చిన్న అల్లూరయ్య, రవ్వా శ్రీనివాసులు, బిజెపి నాయకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలు ప్రాథమిక పాఠశాల సందర్శన! జాయింట్ కలెక్టర్ కల్పనకుమారి







**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు ,**పట్టణంలో పర్యటించారు. ఉప్పుచెరువు, కృష్ణానగర్, విజయనగర్ కాలనీలలోని అంగన్వాడీ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ కల్పన కుమారిగురువారం సందర్శించారు. ఆయా కేంద్రాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ఆహార సరుకుల నిల్వను తనిఖీ చేసి, మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం పెడుతున్నారా అని పరిశీలించారు. పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానికంగా ఉన్న పిల్లల తల్లులతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. చిన్ననాటి నుంచే పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా బలమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వారికి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారిలోని విద్యా ప్రమాణాలను పరిశీలించారు. తరగతికి తగినట్లుగా విద్యార్థులలో ప్రమాణాలు పెంచేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించాలని టీచర్లను ఆదేశించారు.ఆమె వెంట సబ్ కలెక్టర్ హిమవంశీ, తదితర అధికారులు ఉన్నారు.

# వడివడిగా ఎంఎస్ఎంఈలు

**అనకాపల్లి మండలం కోడూరులో 70 ఎకరాల్లో 250 ప్లాట్లు**
**మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి**
**170 మందికి ప్లాట్లు కేటాయింపు**
**నెల రోజుల్లో పరిశ్రమల ఏర్పాటు ప్రారంభం**
**మాకవరపాలెం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు మండలంలో భూముల గుర్తింపు**
**త్వరలో ఏపీఐఐసీకి అప్పగించనున్న రెవెన్యూ అధికారులు**




**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 19** జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుల ఏర్పాటు పనులు వేగవంతం అయ్యాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకొన్నది. అనకాపల్లి నియోజకవర్గానికి సంబంధించి కోడూరులో పార్కు ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. దాదాపు 70 శాతం ప్లాట్లను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల్లో భూ సేకరణ దశల్లో వున్నాయి. ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గత టీడీపీ హయాంలోనే ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసింది.
వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం తక్కువ పెట్టుబడితో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది. ఎలమంచిలి నియోజకవర్గానికి సంబంధించి అచ్యుతాపురం ఎస్ఈజడ్ కోసం సేకరించిన భూముల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 2018లోనే ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటైంది. ఇక్కడ పలు సూక్ష, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు విజయవంతంగా నడుస్తున్నాయి. జిల్లాలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు దశల్లో ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నది. అనకాపల్లి మండలం కోడూరులో 70 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయగా, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యాయి. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవున అంతర్గత రోడ్లను, వాటి పక్కనే ఓపెన్ డ్రైనేజీ కాలువలను నిర్మించారు. రహదారులకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, లైట్లను అమర్చారు. నీటి సదుపాయం కోసం బోర్లు వేసి, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. సుమారు 250 ప్లాట్లు వేశారు. ఇది పాత, కొత్త జాతీయ రహదారులకు చేరువలో వుండడంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నారు. అధికారులు ఇప్పటికే సుమారు 170 మందికి ప్లాట్‌లను కేటాయించారు. ఇక్కడ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ పార్కులో నెల రోజుల్లో పరిశ్రమల ఏర్పాటు మొదలవుతుందని కలెక్టర్ విజయకృష్ణన్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.
రెండో దశలో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలో 290 ఎకరాలు, చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేట మండలం భీమవరం, మల్లాం పంచాయతీల పరిధిలో 200 ఎకరాలు, మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం ఆర్లి గ్రామంలో 100 ఎకరాలను ఎంఎస్ఎంఈ పార్కుల కోసం రెవెన్యూ అధికారులు గుర్తించారు. సర్వే చేసిన అనంతరం సరిహద్దులను నిర్ధారించి ఏపీఐఐసీకి అప్పగించనున్నారు. పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి కోటవురట్ల మండలంలో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి అయిన వంగలపూడి అనిత, అధికారులకు సూచించినట్టు తెలిసింది. దీంతోపాటు పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం లేదా పరవాడ మండలాల్లో కూడా మూడో దశలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటవుతాయని అధికారులు చెబుతున్నారు.

# మత్స్యగెడ్డ వెలవెల

**క్రైం కౌంటర్ న్యూస్ ,** ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 19, మండలంలోని సుజనకోట, పెదగూడ, పనసపుట్టు, జోలాపుట్టు, లక్ష్మీపురం, బుంగాపుట్టు, రంగబయలు తదితర పంచాయతీల పరిధిలో మత్స్యగెడ్డ వెలవెలబోతున్నది. సుమారు నెలన్నర క్రితం వరకు మత్స్యగెడ్డ నిండు కుండను తలపించింది. అయితే రెండు నెలల నుంచి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం, మరోవైపు మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తుండడంతో మత్స్యగెడ్డలో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం శీతాకాలం అయినప్పటికీ మధ్యాహ్నపూట ఎండ తారెత్తిస్తున్నది. దీనివల్ల కొంతమేర నీరు ఆవిరవుతున్నది. వేసవి ప్రారంభానికి ముందే నీటి నిల్వలు తగ్గుతుండడంతో గ్రామాల్లో భూగర్భ జలాలు మరింత దిగజారి, తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని పలు గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యగెడ్డలో నీటి నిల్వలు తగ్గిపోతుండంతో జోలాపుట్టు జలాశయం స్పిల్‌వే గేట్ల ద్వారా డుడుమ జలాశయానికి (మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టు) నీటి విడుదల జరగని పరిస్థితి నెలకొంటున్నది. దీంతో డ్యామ్ రివర్ స్లూయిస్ ద్వారా నీటిని విడుదల చేయాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి వేసవి వర్షాలు కురిస్తే మత్స్యగెడ్డలో కొత్త నీరు చేరుతుందని, లేకపోతే భూగర్భజలాలు మరింత దిగజారి, తాగునీటి సమస్య ఏర్పడుతుందని ఆయా గ్రామాల గిరిజనులు అంటున్నారు.

# నిర్మించారు.. వదిలేశారు..

**వినియోగంలోకిరాని గురుకుల పాఠశాల నూతన భవనం**
**నిత్యం ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**
**ప్రారంభం గురించి పట్టించుకోని అధికారులు**



క్రైం కౌంటర్ న్యూస్ : సీలేరు, ఫిబ్రవరి 19 స్థానిక బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు హాస్టల్ కోసం రెండు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం ఎనిమిది నెలలైనా వినియోగంలోకి రాలేదు. దీంతో వందలాది మంది విద్యార్థులు పాత భవనాల్లో, ఇరుకు వసతితో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సీలేరులోని బాలుర గురుకుల పాఠశాలలో 5వ నుంచి 10వ తరగతి 405 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తరగతుల నిర్వహణ, వసతి, భోజనం చేయడానికి గతంలో నిర్మించిన మూడు భవనాలు చాలకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి రావడంతో 2020వ సంవత్సరంలో మూడు అంతస్థుల భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. రెండు అంతస్థులకు శ్లాబ్ పనులు పూర్తయినప్పటికీ అప్పటి వైసీపీ ప్రభుత్వం బిల్లు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చే వరకు పనులు పునఃప్రారంభం కాలేదు. వైసీపీ హయాంలో చేసిన పనులకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. దీంతో కాంట్రాక్టర్ పనులు మళ్లీ మొదలుపెట్టారు. మొత్తం పనులు పూర్తిచేసి సుమారు ఎనిమిది నెలల క్రితం అధికారులకు అప్పగించేశారు. కానీ ఇంతవరకు భవనాన్ని వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో విద్యార్థులు పాత భవనాల్లోని రెండు బ్లాకుల్లో తరగతులు, ఒక బ్లాకులో హాస్టల్ నిర్వహిస్తూ ఇబ్బందులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇక గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఆవరణలోనే నివాసాలు వుండాలి. కానీ ఇక్కడ నివాసాలు లేకపోవడంతో సీలేరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిర్మించి, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నారు. పైగా పాఠశాలలో వున్న 30 మంది ఉపాధ్యాయులకు సరిపడ రేకుల షెడ్లు అందుబాటులో లేకపోవడంతో ఒక్కో షెడ్డులో ఇద్దరు, ముగ్గురు టీచర్లు సర్దుకొని నివాసం వుంటున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# విలేజ్ క్లినిక్‌లకు నిధులు

పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు
- 284 భవనాలకు రూ.49 కోట్లు మంజూరు
- టెక్కలి మండలంలోని మొఖలింగపురం, నరసింగపల్లి పంచాయతీలకు సంబంధించి నరసింగపల్లి సచివాలయం పరిధిలో విలేజ్ క్లినిక్ నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం రూ.16 లక్షలు కేటాయించింది. ఐదేళ్ల పాలనలో కేవలం పునాదులు(పిల్లర్లు) వేసి వదిలేశారు. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో నరసింగపల్లిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని విలేజ్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నారు.
-మెళియాపుట్టి మండలం వెంకటాపురం, కొత్తూరు గిరిజన పంచాయతీ ప్రజలకు వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌ను మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణం కోసం రామచంద్రపురం వద్ద స్థలం గుర్తించింది. కానీ, ఆ భవనం పునాదుల స్థాయిలోనే నిలిచిపోయింది. బందపల్లి గ్రామంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని విలేజ్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నారు.

టెక్కలిరూరల్, ఫిబ్రవరి 19 జిల్లాలో సగంలో నిలిచిపోయిన విలేజ్ క్లినిక్ భవనాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు భారీగా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచింది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో 535 విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.16లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. అయితే ఈ పనులను కొంత మంది వైసీపీ నాయకులకు అప్పగించింది. దీంతో పనులు చేయకుండానే కొంతమంది బిల్లులు చేయించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. అదే విధంగా కొంతమంది కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవటంతో వారు పనులను సగంలోనే వదిలేశారు. మొత్తం 535 విలేజ్ క్లినిక్‌లకు గాను ఇప్పటివరకు కేవలం 147 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. వీటికోసం రూ.54.72 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇంకా 388 భవనాలను పూర్తి చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విలేజ్ క్లినిక్‌ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ మేరకు జిల్లాలో నిలిచిపోయిన 388 భవనాలకు గాను 284 భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు రూ.49 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే కొన్ని భవనాల పనులు చేస్తుండగా, మరి కొన్నింటికి టెండర్లు పిలుస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. రానున్న కాలంలో మిగతా 104 భవనాలకు కూడా నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణంతో ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఈ కేంద్రంలో జనరల్ ఓపీ, ఈఎన్‌టీ, సుగర్, బీపీ వంటి 14 రకాల వ్యాధులకు వైద్య సేవలందిస్తారు. గర్భిణుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది శ్రద్ధచూపుతారు. ఈ కేంద్రాల్లో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ, కార్యకర్తలు అందుబాటులో ఉంటారు.

పనులు పూర్తి చేస్తాం

గత వైసీపీ ప్రభుత్వంలో విలేజ్ క్లినిక్ భవనాలు సగంలో నిలిపోయాయి. ఆ పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కొన్ని భవనాలకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం (ఎన్‌హెచ్‌ఎం) నేషనల్ హెల్త్ ప్రోగ్రాం ద్వారా నిధులు మంజూరు చేశాయి. పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# 14 నిమిషాల్లో ముగిసిన మండలి

**చైర్మన్ పోడియంను చుట్టుముట్టిన వైసీపీ**
**ఇందాపూర్, హెరిటేజ్‌లపై చర్చకు పట్టు**
**సభా సమయం వృథా చేస్తోంది: హోం మంత్రి**



క్రైం కౌంటర్ న్యూస్ : అమరావతి, ఫిబ్రవరి 18శాసన మండలిలో రెండో రోజు బుధవారమూ వైసీపీ తన ఆందోళనను కొనసాగించింది. తిరుమల లడ్డూ కల్తీ, ఇందాపూర్ డెయిరీ పేరుతో హెరిటేజ్ నెయ్యి సరఫరాపై తమ వాయిదా తీర్మానాలను చర్చకు అనుమతించాలంటూ వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. పోడియంను చుట్టుముట్టారు. దీంతో బుధవారం మండలి ఆరంభమైన తొమ్మిది నిమిషాలకే వాయిదా పడింది. చైర్మన్ మోషేన్ రాజు ఐదు నిమిషాలు మాత్రమే వాయిదా వేసినా... సభ తిరిగి 1.04 గంటలకు ప్రారంభమయింది. వైసీపీ సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో మండలిని గురువారం ఉదయానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి ప్రకటించారు. దీంతో మొత్తం 14 నిమిషాలు మాత్రమే సభ జరిగినట్లు రికార్డుల్లో నమోదయింది. కాగా ఉదయం 10.03 గంటలకు మండలి సమావేశమైనప్పుడు.. మాజీ ఎమ్మెల్సీలు ఐలాపురం వెంకయ్య, టీ రత్నాబాయి మృతికి సంతాపం తెలుపుతూ చైర్మన్ తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం.. వైసీసీ ఎమ్మెల్సీల వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్లు చైర్మన్ ప్రకటించారు. అయినా వైసీపీ సభ్యుల నినాదాలు ఆగకపోవడంతో... టీడీపీ సభ్యులు కూడా నినాదాలకు దిగారు. వైసీపీ వ్యవహార శైలిపై మంత్రులు లోకేశ్, కేశవ్ అసహనం వ్యక్తం చేశారు. సభ వాయిదా పడింది. పునఃప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు తిరిగి ఆందోళనకు దిగారు. తిరస్కరించిన తీర్మానాలపై చర్చ ఉండదని చైర్మన్ ప్రకటించినప్పటికీ వైసీపీ సభ్యులు విరమించలేదు. వారిపై హోం మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిన్నటి నుంచి సంబంధం లేని అంశాన్ని తెచ్చి, సభా సమయాన్ని వృథా చేస్తున్నారు. ప్రజాహితం కోసం సభలో ఎలాంటి చర్చకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కల్తీ లడ్డూపై చర్చకు సిద్ధమో కాదో వైసీపీ సభ్యులు తేల్చుకోవాలి.


వైసీపీ వాళ్లు రాజకీయాల కోసం దేవుడిని వాడుకోవడం బాధాకరం. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వారు వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూల్లో వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందని మేం చెప్పడం కాదు. సీబీఐ చార్జిషీట్‌లోనే స్పష్టం చేసింది. అయినా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు' అంటూ మండిపడ్డారు. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... 'తప్పు చేయనప్పుడు మేమిచ్చిన వాయిదా తీర్మానంపై ప్రభుత్వం చర్చకు అనుమతించాలి' అని డిమాండ్ చేశారు. వైసీపీ సభ్యుల ఆందోళనల నేపథ్యంలో మండలిని గురువారం ఉదయానికి వాయుదా వేస్తున్నట్లు చైర్మన్ మధ్యాహ్నం 1.09 గంటలకు ప్రకటించారు.

ఇందాపూర్‌తో చీకటి ఒప్పందం: బొత్స

'దేవదేవుడి ప్రసాదంపై టీడీపీ అసత్యాలు ప్రచారం చేసింది. ప్రసాదంలో ఎలాంటి కొవ్వు లేదని సీబీఐ తేల్చింది' అని బొత్స సత్యనారాయణ తెలిపారు. అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 'హెరిటేజ్ సంస్థ ఇందాపూర్‌తో చీకటి ఒప్పందం చేసుకుంది. దోచుకోవడమే హెరిటేజ్ ఆలోచన. ఎందుకు సభలో చర్చించడానికి ఈ ప్రభుత్వానికి భయం? బడ్జెట్‌తోపాటు ఇందాపూర్‌పైనా సభలో చర్చించాలి' అని డిమాండ్ చేశారు.

# నేడు హస్తినకు చంద్రబాబు ఏఐ సదస్సుకు హాజరు

**ఐబీఎం సహా పలు సంస్థలతో కీలక ఎంవోయూలు**
**క్వాంటమ్ ఏఐ వర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీతో ఒప్పందం**
**ఏఐ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ**
**ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రకటన**
**పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ**



క్రైం కౌంటర్ న్యూస్ : న్యూఢిల్లీ/ అమరావతి, ఫిబ్రవరి 19 అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'కు సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరు కానున్నారు. ఏపీని సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సదస్సులో పాల్గొంటున్న ఆయన.. ప్రముఖ పారిశ్రామికవేత్తలతో భేటీ అవుతారు. ఉదయం జైపూర్ నుంచి ఢిల్లీకి చేరుకుంటారు. తర్వాత భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌కు వెళ్తారు. ఉదయం 9.30గంటలకు 'ఏఐ యాక్సిలరేటర్స్: ప్యూయలింగ్ ఇండియాస్ ఎకనమిక్ గ్రోత్' అనే అంశంపై జరిగే ప్లీనరీ సెషన్‌లో ఆయన అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి పాల్గొంటారు. అనంతరం ఏపీలో ఏఐ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కల్పనకు సంబంధించిన కొన్ని ఎంవోయూలు రాష్ట్రప్రభుత్వం కుదుర్చుకోనుంది. ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఏపీలోని 10 లక్షల మంది యువతకు నైపుణ్యాలు కల్పించేలా ప్రముఖ ఐటీ సంస్థ ఐబీఎంతో ఒప్పందం చేసుకోనుంది. క్వాంటమ్‌తో పాటు ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు కోసం యూనిసీసీ సంస్థతో, క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీతోనూ ఎంవోయూ కుదుర్చుకోనుంది. 'ఏఐ ట్యూటర్' ఏర్పాటుకోసం ఐఐటీ మద్రాస్ కూడా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోనుంది. ఎన్విడియా భాగస్వామ్యంతో ఏపీలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ఈ సందర్భంగా ప్రకటన చేయనున్నారు.

అనంతరం క్వాంటెలా ఇంక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ గాదితోనూ సీఎం సమావేశమవుతారు. మద్యాహ్నం 12 గంటలకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించే రౌండ్ టేబుల్ కార్యక్రమంలో పాల్గొంటారు. 'కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో చంద్రబాబు పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఏఐ సమ్మిట్ వేదిక వద్దే యూకే ప్రతినిధి బృందంతోనూ భేటీ అవుతారు. బ్రిటన్ ఏఐ, ఆన్‌లైన్ సేఫ్టీ విభాగం మంత్రి కనిష్క నారాయణ్, భారత్‌లో యూకే హైకమిషనర్ లిండి కామరాన్, వాతావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్టర్ కౌన్సెలర్ శాలీ టేలర్ తదితరులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆరాంకో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ ఐతుకైర్, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హేలీతో సీఎం విడివిడిగా భేటీ అవుతారు. అనంతరం ఢిల్లీ నుంచి బయల్దేరి అమరావతికి చేరుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహానికి హాజరు

కాగా.. కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి జైపూర్‌కు చేరుకున్న సీఎం.. అక్కడి వృందావన్ ప్యాలెస్‌లో జరిగిన పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రాత్రికి జైపూర్‌లోనే బస చేసి శుక్రవారం ఉదయం ఢిల్లీ వెళ్తారు.


# 26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

క్రైం కౌంటర్ న్యూస్ : అమరావతి, ఫిబ్రవరి 19 జనసేన సభ్యత్వ నమోదు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుందని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో గురువారం సాయంత్రం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సభ్యత్వ నమోదుతో అన్ని వర్గాల వారినీ, అన్ని రంగాల వారినీ కలుసుకుని పార్టీకి దగ్గర చేసే గొప్ప అవకాశం ఈ నెల 26 నుంచి మార్చి 10వరకు కలుగుతుందన్నారు. దీనిద్వారా పార్టీ క్షేత్రస్థాయి బలాన్ని చాటిచెబుదామని, స్థానిక ఎన్నికలకు సభ్యత్వ నమోదును సన్నద్ధతగా భావిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పిఠాపురం నియోజకవర్గంలో గురువారం లాంఛనంగా ప్రారంభమైందన్నారు. '2020లో 5 నియోజకవర్గాల్లో పైలెట్ విధానంలో మొదలుపెట్టిన కార్యక్రమం.. గతేడాది 12.18 లక్షలకు చేరింది. మొదటి ఏడాది 94 వేల మంది చేరితే అది ప్రతి ఏటా పెరుగుతూ వెళ్లింది. కరోనా సమయంలోనూ 3.30 లక్షల మందిని సభ్యులుగా చేర్చాం. ప్రతి నియోజకవర్గం నుంచి 75 నుంచి 100 మంది సాధక్‌ల పేర్లను సత్వరమే అందజేయాలి. ఉద్యమి సభ్యత్వం తీసుకున్నవారు రూ.400 చెల్లించాలి. వీరికి ప్రమాద బీమా ప్రయోజనాలు అందుతాయి. అలాగే పార్టీకి పరోక్షంగా సహాయసహకారాలు అందించే వారిని ప్రదాత అని పిలుస్తాం. సాధక్‌లకు



అందుబాటులో ఉండేలా.. ప్రత్యేక కాల్ సెంటర్ ఈ రెండు వారాలూ పనిచేస్తుంది. జెన్ జీ తరం సరికొత్తగా ఆలోచిస్తోంది. వారిని పార్టీకి దగ్గర చేయాలి. సభ్యత్వ నమోదును పరిశీలించేందుకు, సమన్వయపరచేందుకు రెండ్రోజుల్లో ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి పరిశీలకులను నియమిస్తాం. ఇతర రాష్ట్రాల్లోనూ సభ్యత్వం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారి కోసం వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసుకునే ఆప్షన్ కల్పించాం. సభ్యత్వ నమోదును రెండు వారాలు ఊరూ వాడా పండుగలా నిర్వహిద్దాం' అని మనోహర్ అన్నారు.

# సినిమా



## బిగ్ బాస్ సోనియా దంపతుల సంచలన నిర్ణయం

సోనియా ఆకుల.. బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో ఈ బ్యూటీ కూడా ఒకరు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈ ముద్దుగుమ్మ మొదట కొన్ని సినిమాల్లో నటించి మెప్పించింది. 2019లో రిలీజైన జార్జి రెడ్డి సినిమాతో నటిగా అరంగేట్రం చేసింది సోనియా. ఆ తర్వాత రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన ఆశా ఎన్ కౌంటర్, కరోనా వైరస్ సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. ఇలా సినిమాలు చేస్తున్న సమయంలోనే సోనియాకు బిగ్ బాస్ ఆఫర్ వచ్చింది. ఎనిమిదో సీజన్ గా కంటెస్టెంట్ గా హౌస్ లోకి అడుగు పెట్టిన ఆమె తన ఆట, మాట తీరుతో బుల్లితెర ఆడియెన్స్ మనసులు గెల్చుకుంది. అయితే ఎక్కువ రోజులు హౌస్ లో ఉండలేకపోయింది. బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చిన వెంటనే వ్యాపారా వేత్త యశ్ ను వివాహం చేసుకున్న సోనియా ఇటీవలే ఓ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటోన్న సోనియా తన భర్త బిజినెస్ ను చూసుకుంటూ బిజీ బిజీగా ఉంటోంది. ఇదిలా ఉంటే సోనియా-యష్ గత కొన్నేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓ ఎన్జీవోను స్థాపించి అవసరమైన వారికి తమ వంతు సాయం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ దంపతులు ఆర్గాన్ డొనేషన్ పై అందరిలో అవగాహన కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా యశ్ సుమారు 450 మంది చేత కళ్లను డొనేట్ చేయించారని తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా తన గురించి తన ఫ్యామిలీ గురించి మరొక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు సోనియా- యశ్ దంపతులు.. తాను సోనియాతో పాటు తన తల్లిదండ్రులు చనిపోతే మా డెడ్ బాడీలు మా కుటుంబ సభ్యులకు సంబంధం లేదని వాటిని గవర్నమెంట్ హాస్పిటల్ కు రాసిచ్చామని తెలిపారు. ' మేము చనిపోయిన తర్వాత మా బాడీ నుంచి ఆర్గాన్స్ తీసుకుని వాటిని ఇతరులకు ఉపయోగిస్తే ఇతరులకు మంచి జీవితాన్ని అందించిన వాళ్లం అవుతాం. అందుకే మా కుటుంబ సభ్యుల డెడ్ బాడీస్ అన్నీ కూడా గవర్నమెంట్ హాస్పిటల్ కి రాసిచ్చాం' అని సోనియా దంపతులు చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట బాగా వైరలవుతున్నాయి. ఇప్పుడు వీరిపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. కాగా తన ఇంటర్వ్యూ చూసినవారు స్వచ్ఛందంగా ఆర్గాన్ డొనేషన్ కు ముందుకు రావాలంటూ కూడా అందరికీ పిలుపు నిచ్చారు సోనియా-యశ్ దంపతులు





## ప్రపంచ కుబేరుల రైస్ ఇది..

సాధారణంగా మన ఇళ్లలో వాడే బియ్యం కిలో రూ. 50 నుండి రూ. 150 వరకు లభిస్తాయి. బాస్మతి రకం అయితే మరో రూ. 100 అదనంగా ఉండవచ్చు. అయితే, ప్రపంచంలో కిన్‌మెమాయ్ ప్రీమియం అనే ఒక ప్రత్యేక రకమైన బియ్యం ఉంది, దీని ధర వింటే చాలా మంది ఆశ్చర్యపోతారు. జపాన్‌కు చెందిన ఈ బియ్యం కిలో కొనాలంటే ఒక బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్ కొనేంత డబ్బు వెచ్చించాలి. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన బియ్యంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.

జపాన్‌లోని టోయో రైస్ కార్పొరేషన్ ఈ ఖరీదైన బియ్యాన్ని ఉత్పత్తి చేస్తోంది. 2016లోనే దీనికి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన బియ్యంగా గుర్తింపు లభించింది. మార్కెట్‌ను బట్టి కిలో బియ్యం ధర సుమారు 12,500 నుండి 15,000 రూపాయల వరకు ఉంటుంది. కేవలం ధర మాత్రమే కాదు, దీన్ని పండించే విధానం, ప్రాసెసింగ్ పద్ధతి కూడా ఎంతో విలక్షణంగా ఉంటుంది. కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం అనేది ఏదో ఒక రకమైన బియ్యం కాదు. జపాన్‌లోని గున్మా, నాగనో, నీగాటా వంటి ప్రాంతాల్లో పండే కోషిహికారీ, పికామారు వంటి ఐదు రకాల మేలైన బియ్యం రకాలను కలిపి దీన్ని తయారు చేస్తారు. ఈ కలయిక దాని ప్రత్యేకతకు ప్రధాన కారణం.

దీని ఉత్పత్తిలో ఆరు నెలల నిరీక్షణ కీలక పాత్ర పోషిస్తుంది. బియ్యం కోత కోసిన వెంటనే మార్కెట్‌లోకి రావు. వీటిని దాదాపు ఆరు నెలల పాటు ప్రత్యేక పరిస్థితులలో నిల్వ చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల బియ్యం రుచి, ఆకృతి గణనీయంగా మెరుగుపడతాయని టోయో రైస్ కార్పొరేషన్ చెబుతోంది. ఇది దాని ప్రత్యేకమైన రుచికి, నాణ్యతకు పునాది వేస్తుంది. ప్రత్యేక పాలిష్ విధానం కూడా కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం యొక్క మరో ప్రత్యేకత. దీని కోసం పేటెంట్ పొందిన ఒక ప్రత్యేకమైన బఫింగ్ ప్రక్రియను ఉపయోగిస్తారు. ఈ పద్ధతి బియ్యం పైపొరను తొలగించినప్పటికీ, అందులోని ముఖ్యమైన పోషక విలువలు ఏమాత్రం నష్టపోకుండా కాపాడుతుంది. దీని వల్ల బియ్యం సహజసిద్ధమైన మంచి గుణాలను నిలుపుకుంటుంది. అద్భుతమైన రుచితో అలరారే ఈ బియ్యంతో అన్నం వండితే అది స్పటికాల్లా మెరుస్తుంది. దీని రుచి కొంచెం తియ్యగా, వెన్నలాగా నోట్లో వేసుకోగానే కరిగిపోయేలా ఉంటుందని బియ్యం రుచి చూసిన భోజన ప్రియులు చెబుతుంటారు. ఈ ప్రత్యేకమైన రుచి అనుభవం దీనిని సాధారణ బియ్యం నుండి వేరు చేస్తుంది. కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం లగ్జరీ గిఫ్ట్‌గా ప్రాచుర్యం పొందింది. టోయో రైస్ కార్పొరేషన్ ఏడాదికి కేవలం 1000 బాక్సులను మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. ఈ పరిమిత ఉత్పత్తి దాని విలువను మరింత పెంచుతుంది. జపాన్‌లో దీన్ని ప్రతిరోజూ తినే ఆహార పదార్థంగా కాకుండా, అత్యంత ఖరీదైన, విలాసవంతమైన కానుకగా ఇతరులకు ఇస్తుంటారు. ఒక సాధారణ ఆహార పదార్థం కూడా సరైన నైపుణ్యం, ప్రత్యేక పద్ధతులు తోడైతే ఎలా గిన్నిస్ రికార్డు సృష్టిస్తుందో చెప్పడానికి కిన్‌మెమాయ్ ప్రీమియం ఒక నిదర్శనం.



## లోపల ఉంది నిజంగా అమృతమే..

బూడిద గుమ్మడి జ్యూస్ ప్రయోజనాలు:

బూడిద గుమ్మడి జ్యూస్ అనేక ఆరోగ్య సమస్యలకు నివారణగా పనిచేస్తుంది.

బూడిద గుమ్మడి శరీరంలోని రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతుంది.

కడుపునొప్పి, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను నివారిస్తుంది. ప్రేగులను శుభ్రపరిచి జీర్ణక్రియను క్రమబద్ధీకరిస్తుంది.

గుండె ఆరోగ్యం: రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యానికి బలాన్ని చేకూరుస్తుంది.

గుమ్మడి కాలేయం, కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది.

బూడిద గుమ్మడికాయ అధిక రక్తపోటును అదుపులో ఉంచుతుంది.

రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

గుమ్మడిలో ఉండే విటమిన్-ఇ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.. కాల్షియం ఎముకలను దృఢంగా చేస్తుంది.

బాడీని డిటాక్స్ చేయడంలో గుమ్మడికాయ ప్రభావవంతంగా ఉంటుంది. శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగించడానికి అద్భుతంగా పనిచేస్తుంది.

బూడిద గుమ్మడికాయలో 96% నీరు, అధిక పీచుపదార్థం, తక్కువ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి ఇది అత్యంత ప్రయోజనకరం. ఒక గ్లాసు జ్యూస్ తాగడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండినట్లు అనిపించి, చిరుతిండ్ల వైపు మనసు మళ్లదు, అతిగా తినడాన్ని నిరోధిస్తుంది.

బూడిద గుమ్మడికాయ యాంటీ-క్యాన్సర్‌గా కూడా పనిచేస్తుందని పేర్కొంటున్నారు.

యాసిడిటీని నియంత్రించి, శరీరాన్ని చల్లబరుస్తుంది.

ఆందోళన చెందేవారు తరచూ ఈ జ్యూస్ తాగితే మంచి ఫలితం ఉంటుంది.

పిల్లలలో జ్ఞాపకశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.

జ్యూస్ తయారీ విధానం:

బూడిద గుమ్మడికాయను జ్యూస్ చేసేటప్పుడు తొక్క, గుజ్జు, గింజలను తీయకూడదు. ఎందుకంటే వీటిలో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కాయను శుభ్రం చేసి, ముక్కలుగా కట్ చేసుకోవాలి.

జూసర్ ఉంటే, కట్ చేసిన ముక్కలను నేరుగా జూసర్‌లో వేసి జ్యూస్ చేసుకోవచ్చు. వడకట్టాల్సిన అవసరం ఉండదు.

## దిమ్మతిరిగే షాకిచ్చిన జింబాబ్వే

టీ20 వరల్డ్ కప్ 2026 గ్రూప్బీ చివరి మ్యాచ్‌లో జింబాబ్వే అద్భుత ప్రదర్శనతో శ్రీలంకను కొలంబోలోనే ఓడించింది. ఈ విజయంతో సూపర్-8కు ముందే గ్రూప్--బీలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటికే ఆస్ట్రేలియాను ఓడించి సూపర్-8లోకి అర్హత సాధించిన జింబాబ్వే, ఇప్పుడు శ్రీలంకపై గెలిచి 'గ్రూప్ టాపర్'గా నిలవడం విశేషం.

శ్రీలంకపై గెలిచి గ్రూప్--బీలో టాప్‌కు చేరిన జింబాబ్వే..

ఈ మ్యాచ్‌కు ముందు గ్రూప్--బీలో జింబాబ్వే 3 మ్యాచ్‌ల్లో 5 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, శ్రీలంక 3 మ్యాచ్‌ల్లో 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఫిబ్రవరి 19న కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే శ్రీలంకను ఓడించడంతో పాయింట్ల పట్టిక పూర్తిగా తలకిందులైంది. గ్రూప్ దశలో నాలుగు మ్యాచ్‌లు పూర్తయిన తర్వాత జింబాబ్వే 7 పాయింట్లతో నంబర్--1గా నిలిచింది. శ్రీలంక 6 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమైంది.

శ్రీలంకపై చరిత్ర సృష్టించిన జింబాబ్వే..

శ్రీలంక నిర్దేశించిన 179 పరుగుల లక్ష్యాన్ని జింబాబ్వే 19.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసి చేధించింది. ఇది ఐసీసీ టోర్నమెంట్‌లలో శ్రీలంకపై జింబాబ్వే సాధించిన తొలి విజయం. అలాగే టీ20 అంతర్జాతీయాల్లో జింబాబ్వేకు ఇది రెండో అతిపెద్ద విజయవంతమైన రన్ చేజ్‌గా నిలిచింది.

కెప్టెన్ సికందర్ రజా 'మ్యాచ్ విన్నింగ్' ఇన్నింగ్స్..

ఈ విజయానికి కెప్టెన్ సికందర్ రజా ప్రధాన కారణం. అతనితో పాటు ఓపెనర్ బ్రియన్ బెన్నెట్ కూడా అద్భుత అర్ధశతకంతో రాణించాడు. బ్రియన్ బెన్నెట్ 48 బంతుల్లో 63 పరుగులు చేయగా, సికందర్ రజా కేవలం 26 బంతుల్లోనే 45 పరుగులు (2 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి 173కి పైగా స్ట్రైక్‌రేట్‌తో జట్టును గెలిపించాడు.

శ్రీలంక బ్యాటింగ్..

ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. పథుమ్ నిస్సాంక 41 బంతుల్లో 62 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పవన్ రత్నాయకె 44 పరుగులతో మంచి సహకారం అందించాడు.




## లిస్ట్ లో టీమిండియా ప్లేయర్లు ఎంతమంది ఉన్నారంటే?

క్రికెట్ అభిమానులలో టీ20 ప్రపంచ కప్ ఉత్సాహం తారాస్థాయికి చేరుకుంది. మైదానంలో ఆటగాళ్ల అద్భుతమైన ప్రదర్శనలతో పాటు, వారి నెట్ వర్త్ కూడా గణనీయమైన దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే చాలా మంది ఆటగాళ్ళు అంతర్జాతీయ క్రికెట్, ఫ్రాంచైజ్ లీగ్‌లు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల ద్వారా అపారమైన సంపదను సంపాదిస్న్?న్నారు. ఆదాయాల పరంగా టాప్ 10 క్రికెటర్లు గణనీయమైన ఆర్థిక రికార్డులను సృష్టించారు.

మాక్స్‌వెల్, హార్దిక్ ప్రస్థానం..ఈ జాబితాలో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్వెల్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఐపీఎల్ ఒప్పందాలు, ప్రపంచ టీ20 లీగ్‌లలో పాల్గొనడం వల్ల అతని నికర విలువ విపరీతంగా పెరిగింది. ఆసియా పిచ్‌లపై అతని అనుభవం జట్టుకు చాలా కీలకం. హార్దిక్ పాండ్యా భారత క్రికెట్‌లో అత్యంత విలువైన వ్యక్తులలో ఒకరిగా పేరుగాంచాడు. రోహిత్, విరాట్ టీ20 నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత, అతను అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు, అతని ఐపీఎల్ కెప్టెన్సీ కారణంగా అతని ఆదాయం గణనీయంగా పెరిగింది.

బట్లర్, బుమ్రాలకు భారీ డిమాండ్..ఇంగ్లాండ్ కు చెందిన విధ్వంసక బ్యాట్స్ మాన్ జోస్ బట్లర్ ప్రపంచంలోనే మూడవ అత్యంత ధనవంతుడైన క్రికెటర్. గుజరాత్ జెయింట్స్ అతనికి  లో రూ.15.75 కోట్లు చెల్లిస్తుంది. అతని ప్రపంచ మార్కెట్ విలువ చాలా ఎక్కువ. ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకరిగా పరిగణించబడే జస్ప్రీత్ బుమ్రా బీసీసీఐ ఏ-కేటగిరీ ఆటగాడు. బుమ్రా ప్రధాన ఆదాయ వనరు అతని కాంట్రాక్టులు, ప్రధాన బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు.

డి కాక్, సూర్యకుమార్ కూడా..

దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాట్స్ మాన్ క్వింటన్ డి కాక్ రిటైర్మెంట్ నుంచి బయటకు వచ్చి ఈ ప్రపంచ కప్ లో ఆడుతున్నాడు. ఐపిఎల్, ఇతర లీగ్ లలో అతని నిరంతర భాగస్వామ్యం గణనీయమైన ఆర్థిక లాభాలను తెచ్చిపెట్టింది. భారత ప్రస్తుత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆదాయంలో డి కాక్ తో పోల్చదగినవాడు. అతను ఇప్పుడు ప్రపంచ క్రికెట్ లో అతిపెద్ద వాణిజ్య బ్రాండ్లలో ఒకడు, ముంబై ఇండియన్స్ నుంచి రూ. 16.35 కోట్లు అందుకుంటున్నాడు.

లిస్ట్ లో ఫినిషర్లకు కూడా.. యువ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్ తన దూకుడు బ్యాటింగ్, ఐపీఎల్ విజయంతో తక్కువ సమయంలోనే గణనీయమైన సంపదను సంపాదించాడు. ఈ ఎలైట్ జాబితాలో ఉన్న ఏకైక మలయాళీ ఆటగాడు సంజు సామ్సన్. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ ఒక పెద్ద ట్రేడ్‌లో కొనుగోలు చేసిన సంజు ఐపీఎల్ జీతం రూ.18 కోట్లు సంపాదిస్తాడు. బలమైన అభిమానుల మద్దతు, బ్రాండ్ విలువ అతన్ని ఈ జాబితాలో ఉంచుతాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఫినిషర్లలో ఒకరైన టిమ్ డేవిడ్, వివిధ దేశాలలో టీ20 లీగ్‌లలో ఆడటం ద్వారా తన సంపదను గణనీయంగా పెంచుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ జాబితాలో పదవ స్థానంలో ఉన్నాడు. మైదానంలో అతని స్థిరమైన ప్రదర్శనలు, ఫ్రాంచైజ్ క్రికెట్‌లో అతని అధిక డిమాండ్ అతన్ని ఆర్థికంగా అగ్రస్థానంలో నిలిపాయి.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com